క్లుప్తంగా

వరద బాధితులకు ఆపన్న హస్తం



నిత్యావసరాల వాహనాన్ని ప్రారంభిస్తున్న పాస్టర్ ఆనంద కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అమీనాపేట సీఎస్ఐ హోలీ ట్రినిటీ గోల్డెన్ చర్చి నిర్వాహకులు విజయవాడలో వరద బాధితులకు ఆపన్నహస్తం అందించారు. రూ.లక్షకు పైబడిన వ్యయంతో చీరలు, దుప్పట్లు, తువ్వాళ్లు, వాటర్ బాటిల్స్, టాయిలెట్ ఐటమ్స్, బిస్కెట్లు తదితర వస్తువులను విజయవాడ ముస్తాబాదకు సోమవారం తరలించారు. వస్తువుల వాహనాన్ని పాస్టర్ ఆనందకుమార్ ప్రారంభించారు. విజయవాడ తరలివెళ్లారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ హెచ్‌ఓడీ కె.శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ స్టూడెంట్స్ ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులు వీధి నాటిక ప్రదర్శించారు. మొక్కలు నాటుదాం, వృక్షాలుగా పెంచుదాం, ప్లాస్టిక్ కవర్లను విడనాడుదాం, క్లాత్, జూట్ బ్యాగులను వాడదాం అంటూ నినదించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ శ్రీధర్ మాట్లాడుతూ మానవుడు చేసిన తప్పిదాల వల్లే విపత్తులు సంభవిస్తున్నాయని, ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని వివరించారు. పర్యావరణానికి హాని కలిగితే మానవజాతి తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు. అనంతరం క్లాత్ బ్యాగులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ కోఆర్డినేటర్ ఎస్ సతీష్, ఇ.కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లాహ్ మార్గం అనుసరణీయం



ప్రసంగిస్తున్న ముహమ్మద్ ఖాసిమ్ రజా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచానికి శాంతి సందేశమిచ్చిన అల్లాహ్ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ముహమ్మద్ ఖాసిమ్ రజా అన్నారు. నగరానికి చెందిన అహలే సున్నత్ వల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానంలో ముహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. నమాజు చదవడంతో మన పూర్తి కాదని, ప్రతి ముస్లిం సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొని సాటి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తోటి వారిని ప్రేమతో ఆదరించి సమాజంలో శాంతి స్థాపనలో ముస్లింలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆయన ఇచ్చిన సందేశాన్ని ఇతరులకు పంచాలని, అన్ని మతాలను సమానంగా ఆదరించి స్నేహపూరిత వాతావరణం నెలకొల్పాలని సూచించారు. అనంతరం సుమారు 1500 మంది ముస్లింలకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అహలె సున్నత్‌వల్ జమాత్ సంస్థ అధ్యక్షుడు ఎండీ సాబీర్ హుస్సేన్, కార్యదర్శి ఎండీ గాలబ్ అలీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్, ఎండీ ఉస్మాన్ దౌలా, అస్లం రజా, ఎండీ యాసీన్, ఎండీ ముజీబ్, ఎండీ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హవనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 23వ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు శ్రీ సుదర్శన నారసింహ హవనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మాయా సూత్రేవష్టనం, యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం ప్రధాన కుంభ స్థాపన చేసి అగ్ని ప్రతిష్ఠాపన, చతాష్ఠానార్చనం, చతుఃపంచాదశ (54) కలశాలతో స్వామి వారికి స్నపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం తిరిగి శ్రీ మత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన,నిత్య హోమం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వినాయక.. సెలవిక



నిమజ్జనానికి వస్తున్న వినాయకుడు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏలూరు నగరంలో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న భారీ వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. స్వామివారి ప్రతిమలను భారీ డీజే, శక్తివేషాలు, కోలాటాలు, చిన్నారుల కర్రసాము, కేరళ వాయిద్యాల నడుమ నగర వీధుల్లో ఊరేగించారు. వన్‌టౌన్ ప్రాంతమంతా భక్తులతో నిండిపోయింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఏలూరు శివారు తూర్పులాకుల వద్ద నిమజ్జనం చేశారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



నిమజ్జనానికి వెళ్తున్న కూరగాయల వర్తక సంఘం వినాయకుడు



డీజే మ్యూజిక్‌కు కుర్రకారు కేరింతలు



వన్‌టౌన్‌లో నిమజ్జనానికి వెళుతున్న కుండీసెంటరు వినాయకుడు



శక్తి వేషాలు



తూర్పులాకుల వద్ద వినాయకుడి నిమజ్జనం



ఊరేగింపులో చిన్నారి కర్రసాము



భక్తులతో నిండిపోయిన ఏలూరు మెయిన్‌బజార్

ప్రయాణం.. ప్రమాదకరం

- ఏలూరు నగరంలో రోడ్లన్నీ గోతులమయం
- రూ.80 లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం
- కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రజల డిమాండ్



ఏలూరు గూడ్స్ షెడ్ సమీపంలో ప్రధాన రహదారిపై గోతులు



పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుపై పెద్ద గొయ్యి



రైల్వే ట్రాక్ రోడ్డులో ప్రమాదకరంగా..



రైల్వే ట్రాక్ రోడ్డులో అధ్వానంగా మరమ్మతులు

ఏలూరు (టూటౌన్): ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం అన్న చందంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లు దర్శనమిస్తున్నాయి. రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు గోతులు పూడ్చడానికి, డ్రెయిన్లలో సిల్టు తొలగించడానికి నగరపాలక సంస్థ నిధులు రూ.80 లక్షలు వెచ్చించి పనులు చేపట్టినట్టు చెబుతున్నా.. వాటి ఆనవాళ్లు ఎక్కడా కన్పించడం లేదు. ఒకటి రెండు పనులు చేసినా అవి కొద్ది రోజులకే మళ్లీ యథావిధిగా గోతులతో దర్శనమిస్తున్నాయి. పూడ్చిన చోట రాళ్లు, దుమ్ము, ఇసుక పైకి తేలి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు ఏదో రకంగా రాకపోకలు సాగించినా.. రాత్రి సమయంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం రోడ్లను మరమ్మతులు చేపట్టాలని నగర ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

100 రోజుల పాలన ఆర్భాటమే!

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి కావడంతో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు సమావేశాలు పెట్టి మరీ గొప్పలకు పోతున్నారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న విధంగా నగరంలోని రోడ్లు దర్శనమిస్తున్నాయి. సామాన్య ప్రజలకు ఒనగూరింది ఏమీ లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ గొప్పలు చెప్పటం మాని నాయకులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రోడ్లపై గోతులు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ గోతులతో దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, అశోక్ నగర్, కండ్రిగ గూడెం, తంగెళ్లమూడి, ఎన్ఆర్ పేట, గ్రేవియర్ నగర్, విద్యానగర్, శాంతినగర్ రోడ్లపై ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. తక్షణం అధికారులు స్పందించి రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేటాయింపులకు నోచుకోలేదు

రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు రూ.400 కోట్లు ఖర్చు చేయనున్నట్టు రాష్ట్ర కేబినేట్ తొలి సమావేశంలోనే ఆర్భాటంగా ప్రకటించారు. ఇంత వరకు ఎటువంటి కేటాయింపులు చేయలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు అన్నీ మరింత అధ్వానంగా మారాయి. రోడ్డు గోతుల్లో వర్షపు నీరు నిలిచి ఏది గొయ్యో.. ఏది గొప్పో తెలియక వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రచార ఆర్భాటాలు మాని వాస్తవిక దృక్పథంతో ఆలోచించి పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సత్వర చర్యలు చేపట్టాలి



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ఉన్న ప్రధాన రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి. అంత కేటాయించాం, ఇంత కేటాయించాం అనే మాటలు కట్టిబెట్టి వాస్తవంగా పనిచేసి చూపించాలి. రోడ్లపై ప్రయాణించాలంటేనే నగర ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకుని పాలకులు సత్వర చర్యలు చేపట్టాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

మరమ్మతుల్లో నాణ్యత పాటించాలి



అధ్వానంగా మారిన ఏలూరు రోడ్లకు తక్షణం వాటికి మరమ్మతులు చేయించాలి. నగర పాలక సంస్థ నిధులు రూ.80 లక్షలు రోడ్ల మరమ్మతులు, డ్రెయినేజీలోని పూడిక తీయడానికి ఖర్చు చేస్తామని చెబుతున్నా.. ఎక్కడా పనులు చేసినట్లు కనబడటం లేదు. గోతులు పూడ్చిన కొద్ది రోజులకే అవి యథాస్థితికి వచ్చి దర్శనమిస్తున్నాయి. మరమ్మతులు నాణ్యతతో చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయుసి నాయకులు, ఏలూరు

అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం మినీ వర్కర్ల జిల్లా సదస్సు సరళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ మినీ వర్కర్లు వర్కర్, హెల్పర్ల పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె కాలంలో వీరికి హామీ ఇచ్చినెరవేర్చలేదని ఆరోపించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేయాలని, వేసవి సెలవులు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ భారాన్ని అంగన్‌వాడీలపై పెట్టొద్దని, ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లు, కందిపప్పు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్‌లు మాట్లాడారు. యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, కె.పుష్ప, ఇందిర, మరియమ్మ, సుజాత, సత్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీస్ బందోబస్తు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, గణేష్ విగ్రహాల నిమజ్జనం, మరోవైపు మిలాద్ ఉన్ నబీ పర్వదినాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ప్రాంతంలోనూ, గణేష్ విగ్రహాల నిమజ్జనం ప్రాంతాల్లోను భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. సీఐలు జి.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావు, గోపాలకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నగరంలో పోలీస్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారని డీఎస్పీ తెలిపారు.

న్యాయవాది తారకంకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ న్యాయవాది, రచయిత, రాజకీయ చైతన్యం గల వ్యక్తి బొజ్జ తారకం అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కొనియాడారు. తారకం 8వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్ఆర్‌పీఎస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తారకం చిత్రానికి పల్లెం ప్రసాద్, పాము మాన్ సింగ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూకపెయ్యి కార్తీక్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తోకల రాజేష్, కురమా రాజు, బి.నాగరాజు, కె.రాజేష్, ఎం సురేష్ పాల్గొన్నారు.

పరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు సమీపంలోని శ్రీ విజయ దుర్గ ట్రేడర్స్ కంపెనీలోని హైడ్రాలిక్ మిషన్ (బేల్ ప్రెస్) మెషీన్‌లో పడి దారుణంగా మృతి చెందిన బీహార్ వలస కార్మికుడు పుల్సార్ శర్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మృతుడు 15 సంవత్సరాల నుంచి ఆ కంపెనీలో పనిచేస్తున్నాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు తెలిపారు. సోమవారం వారు పుల్సార్ శర్మ మృతి చెందిన హైడ్రాలిక్ మెషీన్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు చనిపోయిన తీరు చూస్తుంటే.. అది ప్రమాదవశాత్తూ కాదని, ఉద్దేశపూర్వకంగానే చంపారనే ఆలోచన కలుగుతుందని తెలిపారు. కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల చట్టం లేదా కార్మిక చట్టాలేమీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కంపెనీలో దాదాపు 100 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నప్పటికీ.. వారెవరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పని గంటలు, వారాంతపు, పండుగ సెలవులు తదితర సౌకర్యాలు అమలు చేయడం లేదని అన్నారు. కార్మికుడు మృతిపై భిన్న కోణాల్లో దర్యాప్తు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏలూరులో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్



శంకుస్థాపన చేస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేట పోలీస్ కల్యాణ మండపం సమీపంలో పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన భారత్ పెట్రోల్ కంపెనీకి చెందిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ శంకుస్థాపన చేశారు. పెట్రోల్ స్టేషన్ భవన నిర్మాణ డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన, పక్కా కొలతలతో పెట్రోల్, డీజిల్ అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సీఐలు వైవీ రమణ, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, కంపెనీ మేనేజర్ ప్రసాద్ రాజవాడే, ఇంజినీరింగ్ అధికారి పుల్లూరి ఆచార్య, ఏలూరు సేల్స్ ఆఫీసర్ బొడ్డు సూర్య, కాంట్రాక్టర్ శ్రీమన్నారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేశాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నికల వాగ్దానాలు ఆరింటిలో ఐదు అమలు చేశామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైన సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్ల లబ్ధి చేకూర్చామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12,500 కోట్ల నిధులు తీసుకొచ్చామని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో నిలుపుదల సాధించామని, ఏలూరులో జాబ్‌మేళా నిర్వహించి 566 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని వివరించారు. పామాయిల్ దిగుమతులపై 27.5 శాతం సుంకం విధింపు ద్వారా పామాయిల్ రైతులకు టన్నుకు ధర సుమారు రూ.16,500తో పాటు దేశవ్యాప్తంగా వంటనూనె గింజలు పండించే రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 6వ అంశం త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): నరసాపురంలో దివ్యాంగురాలైన యువతిపైన దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. 2016 దివ్యాంగుల చట్టం సెక్షన్ 92 ఏ ప్రకారం దివ్యాంగురాలిపై దాడి చేసిన వాని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరింది. బాధిత దివ్యాంగురాలికి న్యాయం చేయాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా అధ్యక్షుడె కుందేటి జయరాజు వారు డిమాండ్ చేశారు.